

# సర్వస్వం

ఎమ్. పార్థసారథి

## ఒక పాత పెంకుటింటి పెరట్లో,

వేసవి మధ్యాహ్నపు ఏకాంతంలో, జామిచెట్టుక్రింద.

వయసిచ్చిన అందంతప్ప మరే అర్హతా లేని ఓ పదహారేళ్ళ అమ్మాయి, తన మెడికో మేన బావ రఘురాంతో-మనసు నిండా తియ్యటి కలలతో,

"బావా, నువ్వే నా సర్వస్వం. నీతోనే నా జీవితం. నీ ప్రేమలేందే నేను బ్రతకలేను. నా హృదయం నీది. నీవు లేని జీవితం నే నూహించుకోలేను. మావాళ్లు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా సరే, ఈ లోకం ఏమన్నా సరే మన ప్రేమ శాశ్వతం. మనోవాక్కాయ కర్మలా నేను నీదాన్ని." అంది.

మెడికో బావ మరో మెడికోను పెళ్ళాడగా, తన మెళ్ళో రామలింగం పుస్తె కట్టిన తర్వాత, వేదమంత్రాల ఘోషలో, యజ్ఞకుండం నుంచి వచ్చే పొగల మాటున, పట్టుచీర పరపరలో భర్త పాదాలనంటి:

"నేను మీ దాన్ని. నా శరీరం, నా మనసు మీ అధీనం. నా జీవితం మీ కంకితం. మీరే నా ఆరాధ్యదైవం. నా గుండెను గుడిగా చేసి అందులో మీ రూపాన్ని ప్రతిష్ఠించుకున్నాను. ఉన్నన్నాళ్ళు మీ పాదసేవచేసి సుమంగళిగా మీ ఒళ్ళో తలపెట్టుకుని కళ్ళు మూయటమే నాక్కావలసింది. మీరే నా సర్వస్వం" అనీ.

నొసట కుంకుమ చెరిగిన పిదప, పసి గుడ్డును చేతుల్లో పెట్టుకుని, అన్నగారింటి పంచన నిలిచి

"అన్నయ్యా - ఇంక నాకీ బ్రతుకులో మిగిలిందేమిలేదు. తల్లివైనా, తండ్రివైనా యింక అన్నీ నువ్వే. ఈ పసికందును పెట్టుకుని నీ పంచన బతకనీ, నా దేవుడు నన్నొదిలి వెళ్ళాడన్నయ్యా. ఇంక నువ్వే నా దిక్కు" అంది

కుర్రాడు పెరిగి పెళ్ళీడుకొచ్చాడు.

"ఒరేయ్, నాయనా, ఇన్నాళ్ళు నేనెందుకు బ్రతికున్నాననుకున్నావు: నీ కోసమేరా. ఆ మహారాజు ఆ నాడే పోయినా యింకా వున్నానంటే నీకోసమే బాబూ," అంది.

ఆ తర్వాత మరో పదేళ్ళకు, మనవళ్ళను ముందేసుకుని కూర్చుని:

"అద్దాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడు కాదురా. వాడికోసం యింత చేస్తే వాడికీనాడు పెళ్ళాం బెల్లమైపోయింది. ఇప్పుడైతే నన్ను చూడగానే ఎత్తుకోమంటూ చేతులిస్తున్నారుగాని, రేపు పెరిగి మీ రెంత మర్యాద చేస్తారో నాయనా. రండి. ఏం చేసినా అంతా మీ దయ." అంటూ వాళ్ళు తన చేతుల్లాగుతుంటే నవ్వుకుంటూ, తిట్టుకుంటూ, సాధించుకుంటూ పిల్లల్ని దగ్గరకు తీసుకుంది. ★

